# 7

# ఒక జీవితాన్ని కాపాడిన వ్యక్తి

## (2 రాజులు 8:1-6)

ఈ షూనేమీయురాలు మరియు ఎలీషా కథ ద్వారా ఈ ప్రవక్త ఒక జీవితాన్ని కాపాడగల, ఒక జీవితాన్ని పునఃరుద్ధరించగల వ్యక్తి అని గ్రహిస్తున్నాం. తనకు ఆతిథ్యమిచ్చినటువంటి ఒక కుమారుని ఆశీర్వాదంగా పొందడం ద్వారా ఆయన జీవితాన్ని ప్రసాదించగల వ్యక్తి అని గ్రహించగలము.[1] దేవుని శక్తి ద్వారా ఆ బాలుని తిరిగి బ్రతికించడం ద్వారా అతడు జీవాన్నే పునఃరుద్ధరించగల వ్యక్తి అని చూచాము, దేవుడు తన శక్తి ద్వారా ఈ సేవకుని నడిపించి ఆ స్త్రీని ఆమె కుమారున్ని కాపాడడం అనేది చూస్తూనే యున్నాము.

మనము నేర్చుకున్న పాఠాలనుండి, జీవాన్ని ప్రసాదించేది, పునఃరుద్ధరించేది, కాపాడేది నిశ్చయంగా *ప్రభువే* అన్న సంగతి మర్చిపోవద్దని మనవిచేయుచున్నాం, ఎలీషా కేవలం ప్రభువు ప్రతినిధి మాత్రమే. ఈ రోజున, *సమస్త* జీవానికి కారణం దేవుడే. ఈ భౌతిక జీవానికి ఆయనే కారకుడు: పౌలు "దేవుడే ప్రజలకు జీవాన్ని ఊపిరిని ప్రసాదిస్తున్నాడు" అని వ్రాసాడు (అపొస్తలుడు కార్యములు 17:25). ఆత్మీయ జీవానికి కూడ ఆయనే కారకుడు: యేసు కూడ ఈ విషయాన్ని స్పష్టం చేసాడు, "గొఱ్ఱెలకు జీవితము కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును" తాను వచ్చానని అన్నాడు (యోహాను 10:10). షూనేమీయురాలు వలె మనము కూడ "జీవముగల దేవుని" ద్వారా ఆశీర్వదించబడినాము (1 తిమోతి 4:10). నేను ముగించక ముందు నేను ఒక ప్రశ్న వేయాలనుకొనుచున్నాను, దేవుడు తన కృపద్వారా మీకు అనుగ్రహించే అనేక మేళ్లను మీరు పొందుతున్నారా లేదా.

### కరువు సమయంలో దేవుడు కాపాడుట (8:1, 2)

ఈ పాఠము కొరకు మనము 2 రాజుల గ్రంథంలో కొన్ని అధ్యాయాలు త్వర త్వరగా దాటి పోతూ 8వ అధ్యాయానికి వస్తున్నాము. ఈ షూనేమీయురాలి కుమారుని బ్రతికించిన తరువాత అనేక సంవత్సరములు దొర్లి పోయాయి. ఇంత కాలము ఎలీషా గేహజీలు ఆ స్త్రీ యొక్క ఆతిథ్యాన్ని పొందుతూనే ఉన్నారు, యిలా కొన్ని సంవత్సరములకు వృద్ధుడైన ఆమె భర్త చనియాడు.[2]

ఈ కథ మొదలైనప్పుడు ఈ ప్రవక్త తనకు ఆతిథ్యమిచ్చే సేవకుని ఎదుర్కొన్నాడు. బహుశ ఆయన కర్మెలు పర్వతానికి వెళ్ళుచూ మార్గ మధ్యములో ఆగి పోయి ఉంటాడు, ఎవరి కుమారుడ్ని ఎలీషా బ్రదికించాడో ఆ స్త్రీతో ఎలీషా యిలా అన్నాడు: "ఒకనాడు ఎలీషా తాను బ్రతికించిన బిడ్డకు తల్లియైన ఆమెను పిలిచి – యెహోవా క్షామకాలము రప్పింపబోవుచున్నాడు;[3] ఏడు సంవత్సరములు దేశములో క్షామము కలుగునని చెప్పి – నీవు లేచి, నీవును నీ యింటివారును ఎచ్చటనుండుట అనుకూలమో అచ్చటికి పొమ్మనెను" (1 వచనం).

"***దేవుడు*** కరువు రప్పించబోవుచున్నాడు" అను ఈ మాటలు గమనించండి. కరువు,

దేవుడు యిచ్చే శిక్ష. "నేను తప్ప వేరే దేవుడు నీకు ఉండ కూడదు" (నిర్గమకాండము 20:3), ఇది దేవుడు తన ప్రజలకిచ్చిన మొదటి ఆజ్ఞ. ఉత్తర రాజ్యాలు ఈ ఆజ్ఞనను పెడచెవినిపెట్టాయి. ప్రభువు గట్టిగా హెచ్చరిక చేసాడు,

> ఇవన్నియు సంభవించినను మీరింక నా మాటలు విననియెడల నేను మీ పాపములను బట్టి మరి ఏడంతలుగా మిమ్మును దండించెదను. మీ బల గర్వమును భంగపరచి, ఆకాశము ఇనుమువలెను భూమి ఇత్తడివలెను ఉండచేసెదను. మీ బలము ఉడిగిపోవును; మీ భూమి ఫలింపకుండును; మీ దేశ వృక్షములు ఫలమియ్యకుండును (లేవీయకాండము 26:18–20).

దేవుడు తన ప్రజలను శిక్షించటానికి కరువును వాడుకున్నాడు (హగ్గయి 1:9–11 చూడు) మరియు ఆ విధంగా వారు పశ్చాత్తాపపడటానికి కోరినాడు (1 రాజులు 8:35–40 చూడు). మూడున్నర సంవత్సరములు కరువును ఏలీయా సమయంలో రప్పించాడు (1 రాజులు 17:1; యాకోబు 5:17); యిప్పుడు దాన్ని రెండింతలుగా చేస్తున్నాడు: ఈ కరువు ఏడు సంవత్సరాలు ఉంటుంది (ఆదికాండము 41:27తో పోల్చి చూడు). ఎలీషా రాబోవు ఈ కష్టకాలంనుండి ఆ స్త్రీని కాపాడాలని తలంచాడు. నీవు నీ యింటి వారందరిని తీసికొని ఈ కరువు అయిపోయేవరకు ఎక్కడికైనా వెళ్ళిపో అని ఆమెతో చెప్పాడు (రూతు 1:1; 6ఎ పోల్చి చూడు).

యిప్పుడు ఒక ఆటంకం వచ్చింది: "ఒకవేళ గనుక విగ్రహారాధన వలన ఆ దేశానికి తీర్పు తీర్చవచ్చినట్టయితే అది ఈ స్త్రీ మీదకు ఎందుకు రావాలి? ఆమె విగ్రహారాధన చేయలేదుకదా!" ఒకవేళ ఈ పాఠమును నేర్చుకొనలేక పోతే అది యిప్పుడు నేర్చుకోవాలి (రోమీయులకు 14:7), మానవాళి అంతా ఒకటిగా ఉన్నారు, ఒకరికి ఏదైనా సంభవిస్తే అది అందరికి సంభవిస్తుంది. పాపము ఈ ప్రపంచాన్ని శాపానికి గురి చేసింది (చూడు ఆదికాండము 2:17; రోమీయులకు 5:12), దానివల్ల అమాయకపు ప్రజలు కూడ దోషులతో కూడ బాధింపబడ్డారు. రుమేనియా దేశము నా మనస్సులో మెదలుతుంది, అక్కడ అమాయకపు పిల్లలు **ఎయిడ్స్** వ్యాధితో మరణిస్తున్నారు. వారికి వ్యాక్సినేషన్ చేసేటప్పుడు సిరంజీలను ఉడకబెట్టకుండా యింజక్షన్ యిచ్చారు. కాబట్టి వారు మరణించారు. యిలాంటి పరిణామాలకు ఆ స్త్రీని దూరం చేయాలని ఎలీషా కోరుకున్నాడు కాబట్టి ఇశ్రాయేలీయుల దేశము వదలిపెట్టి వెళ్ళమన్నాడు.

ఈ ప్రవక్త యిచ్చిన సూచనలకు విధేయత చూపటం షూనేమీయురాలికి అంత సులువైన విషయం కాదు. ఈమె, తన స్నేహితులు తన బంధువుల మధ్య సంతోషంగా కాలం గడుపుతుంది (2 రాజులు 4:13 చూడు). ఈ మాటలు ఎలీషా పలికినప్పుడు ఈ కరువు సూచనలు ఏమి కనబడలేదు; పచ్చిక బయలు పచ్చగా ఉన్నవి, పుష్పాలు పుష్పిస్తూనే ఉన్నాయి. పొలాలు పండుతున్నాయి, ఆమె తన యింటివారితో కలసి వేరే దేశము వెళ్ళాలంటే కేవలం అది ఒక విశ్వాస చర్య. యింతకు మునుపు ఆ స్త్రీ ప్రవక్త మాటలకు విధేయత చూపించింది (2 రాజులు 4:16, 28), కాని యిప్పుడు కూడ ఆమె అవిధేయురాలు కాదు. వెనుకంజవేయలేదు. ఆమె "ఆ దైవజనుని మాట ప్రకారం అక్కడనుండి తరలి వెళ్ళింది" (2 రాజులు 8:2ఎ). ఆ విషాదము తరువాత జరిగిన సంఘటనలు ఆమె విశ్వాసాన్ని బలపరచాయి. కొన్ని సమస్యలు

నీకు కూడ అలా చేయవచ్చు (రోమీయులకు 5:3, 4; యాకోబు 1:3 చూడు).

ఆమె "తన యింటివారిని తోడుకొని ఫిలిష్తీయుల దేశమునకు పోయెను" (2 రాజులు 8:2బి). ఫిలిష్తీయులు దేవుని ప్రజలకు బద్ధ శత్రువులు (1 సమూయేలు 4:10; 13:5 చూడు); ప్రస్తుతం ఈ కథ కొనసాగుతున్నప్పుడు ఇశ్రాయేలీయులు ఆరాము (సిరియా)తో యుద్ధం చేయుచున్నారు (2 రాజులు 5:2; 6:8, 24), అది ఫిలిష్తీయ కాదు, "ఫిలిష్తీయుల దేశము" (ఫిలిష్తీయా), ఇది నదీ తీరములో ఉన్నది (133వ పేజీలోని పటమును చూడు). ఫిలిష్తీయ భూభాగము ఎంతో ఫలవంతమైనది, అంతేకానీ, కొండ ప్రాంతము కాదు, కరువుకు లోనైనది కాదు మరియు ఆ పురజనులు సముద్ర మార్గమునుండి వారికి కావలసిన సరుకులు సరఫరా చేసికోగలరు, అందువల్ల ఆ స్త్రీ ఆ ప్రాంతానికి వెళ్ళవలసివచ్చింది (2 రాజులు 8:2).

## కరువులో దేవునియొక్క సహాయము (8:3-6)

"యేడు సంవత్సరముల తరువాత ఈ కరువు ఆగిపోయింది," "తరువాత ఆ స్త్రీ ఫిలిష్తీయుల దేశములోనుండి తిరిగి వెళ్ళి పోయింది" (3ఎ వచనం). ఆమె షూనేము చేరగానే నిర్ఘాంత పోయింది, ఆమె యింటిలో ఎవరో జీవిస్తున్నారు! ఆమె పొలములో ఎవరో పనిచేయుచున్నారు! బహుశ, ఎవరో దురాశాపరులు చట్ట విరుద్ధంగా తన ఆస్తిపాస్తులను జప్తు చేసుకొన్నారు, బహుశ రాజుగారే స్వాధీనం చేసుకున్నాడేమో? (1 రాజులు 21:15 చూడు). తన పక్షంగా ఎవరు లేని ఆ విధవరాలు అంటే అందరికి అలుసే, ఆమెనెంతో తక్కువ తనంగా చూస్తారు (యెషయా 10:2; మత్తయి 23:14 చూడు).

యింతకు ముందు ఎలీషా ఈమె గురించి రాజుదగ్గర చెప్పుతానని వాగ్దానం చేసాడు (2 రాజులు 4:13), కాని ఆమె దానికి అంగీకరించలేదు. ఇప్పుడైతే తన ఆస్తిపాస్తులను తిరిగి రాబట్టుకోడానికి తనకై తానే రాజును వేడుకోవలసి వచ్చింది (8:3బి). డొనాల్డ్ వైజ్‌మెన్ ఉద్దేశం ప్రకారం, "ఆ రోజుల్లో ఎవరైనా వాళ్ళ భూమికి సంబంధించిన గడువు, జమాబంధీల్లాంటి వ్యవహారాలను కేవలం రాజుగారి దగ్గరకే వెళ్ళాలి సుమా."[4] ఆ స్త్రీ తన విన్నపాన్ని చెప్పుకోడానికి సిద్ధపడుతుంటే ఎంతో భయం భయంగా వ్యవహరించింది. వాస్తవానికి రాజు దర్బారులో ఒక స్త్రీ మాట్లాడింది అంటే ఆ మాటకు ఎంతో విలువనిస్తారు.

దేవుడు తనకు మార్గం సరాళం చేస్తున్నాడు అన్న సంగతి షూనేమీయురాలు యింకా గ్రహించలేదు, ఆమె రాజ దర్బారుకు వెళుతున్నప్పుడు కూడ "రాజు దైవజనుని పనివాడగు గేహజీతో మాటలాడి" (వచనం 4ఎ). గేహజీ అక్కడెందుకున్నాడో మనకు తెలియదు. బహుశ ఎలీషా రాజుకు ఒక సందేశం అతనిద్వారా పంపియున్నాడేమో. ఈ గొప్ప ఘనతగల ప్రవక్త అతని సేవకుని తన వద్దకు పంపడంలో ఏదో విశేషం ఉంటుందని రాజు ఆసక్తి కనబర్చుచుండవచ్చు.[5] ఏదేమైతేనేమి గేహజీ చక్రవర్తిగారి దగ్గరున్నాడు, రాజు యిలా అన్నాడు, "ఎలీషా చేసిన గొప్ప కార్యములన్నిటిని నాకు తెలియజెప్పమని ఆజ్ఞయిచ్చెను" (4బి వచనం).

ఆ రాజెవరో మనకంతగా తెలియదు, "యోరము (యెహోరాము) ఏలుబడిలో మధ్యలో ఏడు సంవత్సరాల కరవు సంభవించింది.[6] 2 రాజులు 8:1-6 సమయంలో యోరాము ఏలుచున్నాడు. ఆ తర్వాతి రాజు యెహు అయియుంటాడు.[7] "సరే ఆ రాజెవరు అన్న సంగతి అంత ముఖ్యమైంది కాదుగదా."[8] రాజులను వేడుకగా కనబర్చడం దేవుని *ఉద్దేశం* కాదు,

గాని విశ్వాసము, విధేయతవల్ల ఎంతమేలు జరుగుతుందో అన్న సత్యాన్ని మనకు తెల్పడమే ఆయన లక్ష్యం.

ఆ రాజే గనుక యెహోరాము అయియున్నట్టయితే, ఎలీషా ఎదోము అరణ్యంలో తన సేనలను ఎలా కాపాడినాడో బాగా తెలుసు. అద్భుతాలను, సూచక క్రియలను గూర్చిన పుకార్లను వింటుండేవాడు. యిప్పుడు మాత్రం సంపూర్ణ నివేదికకు అన్ని విషయాలను ఆసక్తిగా అడుగుచున్నాడు. రాజుకున్న ఆసక్తికి విస్తుపోయాడు గేహజీ, అంతేగాక తనను అడిగినందుకు కూడ గ్రేట్‌గా ఫీలయ్యాడు. చెడిపోయిన నీటిని స్వచ్ఛమైన జలంగా ఎలీషా ఎలా మార్చినాడో గేహజీ చెప్పడం నేను వింటున్నట్టుగా భావిస్తున్నాను, నూనెను ఎలా వృద్ధిచేశాడో దాని గురించి, అంతేకాదు తనను బోడివాడా బోడివాడా అంటూ ఎగతాళి చేసిన ఆకతాయి కుర్రవాళ్ళకి ఎలా సాస్తి చేశాడో అదికూడ చెప్పబడడం వింటున్నాను (ఒకవేళ రాజుగారే బోడినెత్తివాడయియుంటే ఈ కథకు యింకా సంతోషపడేవాడే) ఈ వివరణ అంతటిలోకెల్లా ఆసక్తివంతమైంది, చనిపోయిన బాలుని లేపడమేగదా! చనిపోయినవారిని లేపడంలో రోజు సామాన్యంగా జరిగే విషయంకాదు సుమా! మహా మహా అద్భుతాలు చేసే మహానుభావులు చేసేది కూడ కాదు, పాత నిబంధనలో చనిపోయినవారిని లేపిన సందర్భాలు మూడు చోట్లవున్నాయి (1 రాజులు 17; 2 రాజులు 4; 13), మరియు దీంట్లో రెండు ఎలీషాకు సంబంధించినవి.

గేహజీ యిలా వివరణ వల్లించుచుకొంటూ పోతుంటే, ఆ సింహాసనమున్న దర్బారులోకి ఎవరెళతారండి, ఆ స్త్రీ ఆ బాలుడు తప్ప (2 రాజులు 8:5ఎ)! యిలా సందర్భాలు సమకూడడం, కలసిరావడం ఏదో యాదృచ్ఛికంగా జరిగినవి కావు అది దేవుని ఏర్పాటే. రాజు ఆ స్త్రీ విషయమై ఆసక్తి కనబర్చాలని, ఆమె విన్నపాలను వమ్ముచేస్తాడని అంటే దీన్నే దైవానుగ్రహం అని అంటాం (రోమీయులకు 8:28): సర్వసాధారణంగా సృష్టి సూత్రాల చట్టాల ద్వారా దేవుడు తనవారికి అందిస్తున్న సహకారం, చేస్తున్న మేళు కదా!

ఆ స్త్రీని చూడ్డం గేహజీకి ఆశ్చర్యమనిపించింది, అతడు పట్టరాని సంతోషంతో యిలా అనడం నేను చూస్తున్నాను, "నా యేలినవాడవైన రాజా ఆ స్త్రీ *యిదే*; మరియు ఎలీషా తిరిగి బ్రదికించిన యీమె బిడ్డ వీడే" అని చెప్పెను (2 రాజులు 8:5బి; నొక్కి చెప్పింది నాది). అనగా, "అంతగా కావాలంటే ఆమెను మీరే అడగండి!" అన్నట్లుంది. ఆ రాజు నిశ్చయం చేసుకోటానికి ఆమెను అడిగాడు, బహుశ ఆమె చిరునవ్వుతో ఆ చిన్న బాలుని మీద చెయ్యి వేసి ఆ కథ అంతటిని స్వయంగా తన పెదాలనుండి అతనికి తిరిగి వల్లించింది (6ఎ వచనం).

రాజు ఎంతో ఆనందపడినాడు. "ఆ విధవరాలు, ఆమె కుమారుడు ప్రభువు తన వాక్యముపట్ల విధేయులైనవారికి తన ప్రవక్త ద్వారా ఎటువంటి మేళ్ళు, ఆశీర్వాదాలు సమకూర్చుకోడో అనడానికి ప్రతీకలుగా ఉన్నారు." జీవ మరణముల శక్తిని తన హస్తగతము చేసికొన్ని వ్యక్తితో అనుబంధమున్న ఈ స్త్రీకి ఎంతో సహాయం చేయవలెనన్న చక్రవర్తికి యిష్టమేనని స్పష్టం చేసాడు. బహుశ ఆమె అడిగినదానికంటె ఎక్కువ చేయాలని రాజు నిర్ణయించుకొనియుండవచ్చు. ఆమె తన స్వాస్థ్యాన్ని తిరిగి ఆమెకు సమకూర్చడమే కాదు, దానికింకా రాబట్టవలసిన లాభం ఏదివున్నా దాన్ని కూడ కలిపి సమకూర్చడానికి యిష్టపడి యుండవచ్చు.[10] అతడు ఈ పనికోసం "ఒక అధికారిని నియమించినాడు" అతనికిలా సూచనలిచ్చాడు, "రాజు ఆమె పక్షముగా ఒక అధిపతిని నియమించి, ఆమె సొత్తు యావత్తును

ఆమె దేశము విడిచినప్పటినుండి నేటివరకు భూమి ఫలించిన పంట యావత్తును ఆమెకు మరల ఇమ్మని సెలవిచ్చెను" (6బి వచనం).

ఆమె పట్టరాని ఆనందంతో రాజసన్నిధి నుండి వెళ్ళిపోయింది. ఆమె ఆస్తిపాస్తులు తిరిగి ఆమెకు సమకూర్చబడినవి, ఎలీషాతో తన అనుబంధాన్ని కలిగియున్నందుకు ఆమె ఎంతో కృతజ్ఞురాలు. యిక అప్పటినుండి ఆమె గృహానికి రెండింతల అభిమానంతో ఆహ్వానించబడి నాడు. ఎలీషా ప్రవక్త అప్పటినుండి అతడు తన సేవలో ఆ గ్రామంగుండా వెళ్తున్నప్పుడు అక్కడ ఆగి ఆ గృహంలో విశ్రాంతి తీసుకొంటూ ఎంతో ఆనందంతో కొన్ని గంటలు గడిపేవాడు. యిక యింతటితో ఈ ఎలీషా, షూనేమీయురాలి కథను ముగిద్దాం.

## ముగింపు

ఈ పాఠాన్ని ముగించకమునుపు ఒక సత్యాన్ని మరలా మీకు స్పష్టం చేస్తాను, మనకు జీవితాన్ని ప్రసాదించువాడు, కాపాడువాడు, తిరిగి జీవితాన్ని అనుగ్రహించువాడు *దేవుడే.* మన భౌతిక జీవితానికి ఈ మూడు సూత్రాలను అన్వయించుకోవచ్చు: దేవుడు మన జన్మతోనే ఈ భౌతిక దేహాన్ని ప్రసాదించినాడని (ఆదికాండము 2:7; అపొస్తలుల కార్యములు 17:25), ఈ దేహాన్ని తన అమూల్యమైన ఆశీర్వాదాలతో పోషింస్తుంటాడు (మత్తయి 5:45), ఆఖరిలో ఈ దేహానికి నిత్య జీవ లక్షణాలను అనుగ్రహిస్తాడు (యోహాను 5:28, 29). ఏమైతేనేం ఈ ఆత్మీయ జీవితానికి కొన్ని అన్వయించాలని నేను కోరుచున్నాను:

- ఆత్మీయ జీవితాన్ని ప్రసాదించేది దేవుడేనని దానికి వనరులు చేకూర్చి నడిపించేది ఆయనేనని (చూడు యోహాను 17:3). ఎవరైతే పాపంలో మరణించియున్నారో ఆయన కృపద్వారా క్రీస్తులో తిరిగి జన్మిస్తారు (ఎఫెసీయులకు 2:5).
- దేవుడు ఆత్మీయ జీవితాన్ని కాపాడుచున్నాడు. పౌలు యిలా వ్రాశాడు, "ఆ హేతువుచేత ఈ శ్రమలను అనుభవించుచున్నాను గాని, నేను నమ్మినవాని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించినదానిని రాబోవుచున్న ఆ దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను" (2 తిమోతి 1:12).
- ఆత్మీయ జీవితాన్ని పునరుద్ధరించగలవాడు దేవుడే, ఎప్పుడైతే మనము మన పాపాలకు పశ్చాత్తాపపడి ఆయనవద్దకు వచ్చినట్టయితే ఆయన మన రక్షణా నందాన్ని మనకు సమకూర్చుతాడు (కీర్తనలు 51:12).

నీవు జీవాన్ని కలిగియుండాలని దేవుని కోరిక, అలా అయితే ఆయన యొక్క దాతృత్వాన్ని మేలుకరంగా చేసికొనుచున్నామా?

- ఎంతో నమ్మకమైన విశ్వాసిగా (అపొస్తలుల కార్యములు 2:36–38) మీరు "క్రీస్తులోనికి" బాప్తిస్మము పొందియున్నారు (రోమీయులకు 6:3; గలతీయులకు 3:26, 27), కాబట్టి నీవు "క్రీస్తులో నూతన జీవము" కలిగియుండవచ్చు (రోమీయులకు 6:23)?

- నీవు క్రీస్తు ప్రభువుతో "నూతన జీవితాన్ని జీవిస్తున్నావా" (రోమీయులకు 6:4) అందువల్ల ఆయన నీ పాపాలను కడిగివేయును (1 యోహాను 1:7) మరియు ప్రతిరోజు బలపరుస్తాడు (హెబ్రీయులకు 13:5, 6)?
- నీవు మంచి మార్గాన్నుండి దూరంగా వెళ్ళిపోయున్నట్టయితే (యాకోబు 5:19, 20 చూడు) ఎంతో పశ్చత్తాపంతో ప్రభువు వైపు తిరిగియున్నావా, ఒప్పుకొని ప్రార్థించావా (అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9). అందువల్ల ఆయన నీ ఆత్మీయ స్థితిని పునరుద్ధరింపజేస్తాడు (గలతీయులకు 6:1; కీర్తనలు 80:3, 7, 19)?

నీకు దేవుడు ప్రసాదించిన జీవితాన్ని పూర్తిగా అనుభవించాలని నీకు తెలుసా? ఆ విషయం వాయిదా వేయవద్దు సుమా! "కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును" (యాకోబు 4:17).

---

సూచనలు

[1]Adapted from Joseph L. Gardner, ed., *Who's Who in the Bible* (Pleasantville, N.Y.: Reader's Digest Association, 1994), 99. [2]ఒకవేళ భర్త బ్రతికుంటే కేవలం అతనే తన ఆస్తిపాస్తుల సమకూర్చు విషయమై రాజుకు విన్నవించుకునేవాడు. ఆమె భర్త బహుశ చనిపోయేవుంటాడు గనుక ఆ స్త్రీ రాజుకు విన్నవించుకొనవలసివచ్చింది (2 రాజులు 8:3, 5). ఆ రోజుల్లో వారి కుటుంబం ఫిలిష్తీయాలో ఉండగానే అతను చనిపోయియుండచ్చు. కాని మొదటి వచనం ప్రకారం చూచినట్టయితే ఆమె తన యింటివారందరితో కలిసి ఫిలిష్తీయకు వెళ్ళినప్పటికంటె ముందే ఆమె భర్త మరణించియున్నాడని తెలుస్తుంది. [3]యిది బహుశ 2 రాజులు 4:38లో ప్రస్తావించబడిన కరువులాంటిదేనని చెప్పవచ్చు. దీన్ని మనం వచ్చే పాఠంలో వివరించుకుందాం. [4]Donald J. Wiseman, *1 and 2 Kings: An Introduction and Commentary,* Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1993), 213. [5]యిక్కడ యోరాముకు, ఎలీషాకు మధ్య సంబంధాలు తెగిపోయాయి (2 రాజులు 3:13, 14 చూడు). ఒకవేళ రాజు గనుక ఎలీషా గురించి తెలుసుకోవాలనుకుంటే అతడు ఎలీషాకంటే కూడ అతని సేవకునే పిలిచియుండేవాడు. [6]C. F. Keil and F. Delitzsch, "1 and 2 Kings," *Commentary on the Old Testament,* vol. 3, *1 and 2 Kings, 1 and 2 Chronicles, Ezra, Nehemiah, Esther* (Peabody, Mass.: Hendriksen Publishers, 1989), 333. [7]Wiseman, 213. [8]James Burton Coffman and Thelma B. Coffman, *Commentary on Second Kings,* James Burton Coffman Commentaries, The Historical Books, vol. 6 (Abilene, Tex.: A.C.U. Press, 1992), 96. [9]J. Robert Vannoy, notes on 2 Kings, *The NIV Study Bible,* ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 536. [10]అది ఏడు సంవత్సరాల కరువు కాబట్టి, ఆ రాబడి లాభాన్ని అతను లెక్క చేసేవాడు కాదు, కాని కొందరన్నట్లు "ఏమిలేనిదానికంటె కొద్దిగా ఉండటం మేలే గదా" అని.